# విజయ విజ్ఞానం

శ్రీ వి. యల్. రాధ

విజయ అప్పుడే నిద్రలేచింది. ఇంట్లో అంతా గందరగోళంగా ఉంది. విజయకేమీ బోధపడలేదు. ఇల్లాంతా నాలుగైదుసార్లు కలయతిరిగింది. ఎవరి పనుల మీద వాళ్లున్నారు. ప్రతివారికీ నిలబడి మాట్లాడే తీరికే లేనట్లుగా నడుస్తూనే ప్రతివాళ్ళూ ప్రతివాళ్లకూ పనులు పురమాయిస్తూనేయున్నారు. కాని చేసేదెవరు? విజయకిదంతా అగమ్యగోచారంగాఉంది. పదేళ్ల పసిహృదయానికి ఈ తతంగమంతా తెలుసుకునే తాహతెక్కడిది? బిక్కు బిక్కుమంటూ ఇల్లంతా తిరుగుతుంది. ఎవరిపనులు వారు చేసుకొనేవారేగాని విజయను పలకరించిన దిక్కే లేదు.

విజయకు విసుగుపుట్టింది. సరాసరి అక్క గదిలోకెళ్ళింది. ఆమె గారు తెలియని తన్మయత్వంలో తలగడమీద తల ఆన్చి మదిలోని మధురానుభూతులను తలచుకొని తనలో తానే నవ్వుకొంటూంది. విజయగదిలో కెళ్ళి 'అక్కాయ్' అని రెండుసార్లు పిలిచింది. 'ఊహు, ఆమెపలికితేగా' విజయలోని విసుగు అంతిమస్థాయినందుకొంటూంది. ఇహ మాటలతో లాభము లేదనుకొని అక్కాయ్ చెవిలో కాసిని సిళ్ళుపోసింది. "ఫీ! పోవే మొద్దుముండా" అంటూ ఆమె అమాంతంగా ఈ లోకంలోవచ్చి విజయను ఒక మొట్టికాయ మొంది.

విజయకు కళ్లనీళ్ల పర్యంతం అయింది. "అక్కాయ్! ఏమిటివ్వాళ మనింట్లో" అంది విజయ.

ఆమె తిన్నగా ముసిముసి నవ్వులునవ్వుకుంది. తన ప్రశ్నకు జవాబు చెప్పకుండా అక్క ఎందుకు నవ్వుకుంటుందో విజయకు బోధపడలేదు. మళ్ళీ అడిగింది.

ఆమె పలుకే బంగారమయినట్లుగా "ఇవాళమనింట్లో పండుగ" అనిఒక్క మాట చెప్పి యూరుకుంది.

"మొన్నేగా సంక్రాంతి పండుగ వెళ్ళిపోయింది. అప్పుడే పండుగేంటి" అంది విజయ.

"అంతేలేవే మొద్దుమొఖమా! ఇవాళ పండుగగాని పండుగ – మరో పెద్ద పండుగ" అంది అక్క. 'పిల్లి అంటే మార్జాలము' అన్నస్థితిలో ఉంది మన విజయపరిస్థితి. బిక్క మొగము పెట్టింది,

అక్కకు విజయను చూచేసరికి జాలేసింది.

"ఇటురావే మొద్దూ. ఇవాళ నా పండుగ" అంది అక్క.

అక్క శాంతంగా చెబుతుంటే విజయకు ఉత్సాహము కలిగింది.

"నీపండుగయితే నాపండుగ గా దేంటి!

అక్క పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వి

"నీపండుగ ఇంకోపది సంవత్సరాలు పోయి నాక చేసుకుందువుగానిలే" అంది.

"ఎందుకేంటి – మొన్న సంక్రాంతికి నువ్వు తలంటు పోసుకున్నావు; నేనూ పోసుకున్నాను. నువ్వు కొత్తగుడ్డలు కట్టుకున్నావు; నేనూ కట్టుకున్నాను. ఇవ్వాళ నువ్వుపండుగ జేసుకుంటున్నావు. నేనూ జేసుకొంటాను"

అక్క అయిన అరుంధతి కేమి చెప్పాలో అర్థంగాలేదు.

"అది గాదే విజయా! ఇవాళ నా పండుగ. అంటే పెళ్ళిలాంటి మరో పెద్ద పండుగ" అంది అరుంధతి.

"అయితే నువ్వు పెళ్ళిచేసుకొని నాలుగైదునెల్లేగా అయింది. మళ్ళీ పెళ్ళిచేసుకుంటున్నావేంటి. అప్పుడు తాతయ్యా, మామయ్యా వాళ్ళందరూ వచ్చారుగా- ఇవాళ రాలేదేం"

విజయకు సమాధానం జెప్పటానికి అరుంధతికి మాటలే దొరకలేదు.

"వాళ్ళెవరూ ఇవాళ రారులేవే-వాళ్లు రాకూడదు ఇవాళ ఆడవాళ్ళ పండుగగాని మగవాళ్ళపండుగకాదు" అంది అరుంధతి.

"అయితే బావొచ్చాడెందుకు" రకీమని అడిగింది విజయ.

"ఫోవే. నీకు చెప్పేసరికి తలప్రాణం "తోకకు వస్తుంది." అని విసుక్కుంది.

"నువ్వు జెప్పకపోతే అమ్మ చెప్పదనుకున్నావా! అమ్మను అడుగుతానుండు" అని విజయ తుర్రుమంది. విజయ మళ్ళీ వస్తే బావుండును అని అనుకొంది అరుంధతి.

విజయ తల్లి దగ్గర కెళ్ళింది. ఆమె అమ్మలక్కలతో మాట్లాడుతూ వుంది. ఏమిటో చెప్పుకుని వాళ్లందరూ నవ్వుకొంటున్నారు. విజయకి దేమీ అర్థంగాలా.

"ఏమిటివ్వాళ. అమ్మా! మనింట్లో" అని విజయ తల్లినడిగింది. ఆమె నవ్వుతూ "ఇవ్వాళ అక్కయ్య పండుగ" అంది.

అమ్మలక్కలందరూ ఒక్కసారి నవ్వారు.

"అక్కయ్యకు పండగయితే నాకూ పండగేగా! అక్కయ్య తలంటు పోసుకుంది! కొత్తగుడ్డలు కట్టుకుంది. నాక్కూడా తొందరగా తలంటిపోయవే. నేకూడ కొత్తగుడ్డలు కట్టుకుంటాను" అంది విజయ క్రొత్తగుడ్డలు కట్టుకోవచ్చు అనే సంబరంతో.

"ఛో! విజయా అవతలికి పో. నీమొగుడొచ్చాక నీవు నీపండుగ జేసుకుందువుగానిలే" అని అమ్మ కసురుకొంది.

అమ్మకంటే అక్కే నయమనిపించింది. మళ్ళీ అక్కదగ్గరకు వచ్చింది.

"మరే ... అక్కయ్య .. ఇవాళ నీ పండగ. అమ్మకూడా నాతో చెప్పింది, నా పండగట నా మొగుడొచ్చి నాక జేసుకోవాలట. నీ పండుగయితే బావెందుకొచ్చాడక్కయ్యా" అని విజయ వినయంగా అడిగింది.

అక్కదగ్గరనుంచి చిరునవ్వు తప్పమరే సమాధానము రాలేదు.

విజయ మళ్ళీ అడిగింది.

అరుంధతి విసుగుతో "ఏమో - ఎందుకొచ్చాడో వెళ్ళి మీ బావనే అడగరాదూ! నన్నడుగుతావెందుకు!" అంది.

"మా బావ బలేమంచాడు. నేనడిగినవన్నీ చెబుతాడుగా-వెళ్ళి మా బావనే అడుగుతానుండు" అని విజయ బావగారి గదిలోకి తుర్రుమంది. విజయ నిజంగా బావను అడుగుతుందేమోనని భయంతో అరుంధతి విజయను బిగ్గరగా కేకేసింది. విజయ ఎప్పుడో బావగదిలోకెళ్ళిపోతే ఈమాట వినేదెవ్వరు?

విజయ బావగారి గదిలోకెళ్ళేసరికి ఆయన ఫుల్‌సూటుతో మేకప్ అవుతున్నారు. విజయ బావను పిలిచింది,

"బావా......"

"ఏం మరదలు పిల్లా! ......మీఅక్క పంపిందా"

"మరే.. మరే...ఇవాళ మా అక్క పండుగట మరినువ్వొచ్చావెందుకు?" ఆనందరావు నవ్వకుండా ఉండలేక పోయ్యాడు.

"ఎవరు జెప్పారు ... ఇవాళ మీ అక్క పండుగని"

"మా అక్కే చెప్పింది. ఇవాళ ఆడవాళ్ళ పండగట! అందుకని మా తాతయ్యా మామయ్యా వాళ్ళు రాలేదట. ఆయితే నువ్వెందుకు వచ్చావు?"

"మీ అక్కయ్య పండుగెలా చేసుకుంటుందో చూద్దామని - ఏం రాకూడదా?"

"మొగాళ్లు రాకూడదుగా. ఇది ఆడవాళ్ల పండుగ్గా"

"ఇది ఆడాళ్ళ పండగయితే మట్టుకు నేనులేకుండ మీ అక్కయ్య పండుగెట్లా చేసుకుంటుంది."

అంటే ఏమిటో విజయకు అర్థంగాలా

"ఏం ఎందుకు చేసుకోదేంటి. తలకు నీళ్ళు పోసుకోంది. కొత్త గుడ్డలు కట్టుకుంది. అది పండగ కాదా ఏంటి?"

"సరే నేను వెళుతున్నాలే"

"ఎక్కడికి?"

"సినిమాకి"

"అమ్మ దొంగా... సినిమా కెళ్తానికే నా కొత్త గుడ్డలు తొడుక్కున్నావు. నే కూడా వస్తా బావా! భలే భలే సినిమాలు ఆడుతున్నాయి."

"నువ్వు ఒక్కదానివే వస్తావా... మీ అక్కయ్యను కూడ తీసుకు రావూ" అన్నాడు.

"వద్దు బావా... మా అక్కయ్యవద్దు. అదెప్పుడు సినిమా కెళ్ళినా నన్ను తీసుకెళ్ళదు. ఇవాళ మా అక్కయ్యపండుగ్గా- పండుగ చేసుకుంటుందిలే."

విజయ అమాయకత్వానికి ఆనందరావు తనలో తానే నవ్వుకొన్నాడు.

"విజయా! సినిమా కెళ్దాం. లే....మరి మీ అక్కయ్య నడిగి సినిమా కెళ్ళమంటుందో వద్దంటుందో కనుక్కురా."

"అక్కయ్య సినిమాకి వెళినప్పుడల్లా నిన్నడుగుతుందేమిటి నీవు వెళ్ళేప్పుడు అక్కయ్యను అడగటానికి."

"ఇవాల్టినుంచి అడుగుతుందిగా" అన్నా.

ఇవాల్టినుంచి అక్కయ్య సినిమాకు వెళ్ళేటప్పుడు బావను ఎందుకు అడుగుతుందో విజయకు తెలీలా.

"సరే బావా...అక్కయ్యను అడిగి కొత్త గుడ్డలు తొడుక్కొస్తాంనుండు." అంటూ విజయ.

"అక్కా! అక్కా! ..." అక్కగారి గదిలోనికి పరువెత్తింది.

ఆమేదో దీర్ఘాలోచనలో నున్నది. తానింక కొన్ని గంటలలో భర్త సాన్నిధ్యంలో ఉంటుంది. ఆయనతో తనెట్లా మాట్లాడాలి! అందులో మగవాడు! తానింత వరకు పరాయి మగవాడితో మాట్లాడి ఎరుగదు. తాను స్కూలులో చదివేటప్పుడు కనీసము తోటి విద్యార్థులతో నన్నా మాట్లాడి ఎరుగదు. అటువంటప్పుడు ఒక్కసారిగా ఇంతవరకూ పరాయివాడైన తన భర్తతో ఎలా మాట్లాడటం ఒక్కసారి అరుంధతి గుండెలు దడదడలాడినవి. అంతలోనే ఒక మధురహాసరేఖ ఇట్టే మెరచినది. ఆమెకు తెలీకుండానే ఆమె నవ్వసాగింది. ఒకవేళ 'వారే' ముందు మాట్లాడింతురా! ఏమని మాట్లాడుతారు? 'నీపేరేమిటని అడుగుతారా' 'ఛీ! ఏమిటీ చచ్చుప్రశ్న' నాపేరు తెలీకుండా నన్నెట్లా పెళ్ళాడాడు. ఈ ప్రశ్న అడగరు. ఇంకేమని అడుగుతారు.

'నామీద ప్రేముందా' అని అడుగుతారా. 'ఛీ! ఏమిటీ చొప్పదంటు ప్రశ్న'! వారిమీద ప్రేమలేకపోతే నేనెట్లా చేసుకొంటాను. ఈ ప్రశ్న అడగరు. ఇంకేమని అడుగుతారు. ఆ! ఏదో ఒకటి అడుగుతారెద్దూ. ఏమీ అడక్కుండా వచ్చి ఒక్కసారి నన్ను పట్టుకుంటే "చూడవే అమ్మా" అని ఒక్కసారి కేకేస్తాను. "అవుతుంది అబ్బాయిగారి పని అంతటితో" అని అనుకొంటూంది అరుంధతి వచ్చే నవ్వును ఆపుకోటానికి శాయశక్తుల ప్రయత్నిస్తూ.

ఈ ఆలోచనలతో అరుంధతికి విజయ అరుంధతి చెవిలో బిగ్గరగా "అక్కయ్యా" అని అరచింది.

అరుంధతి ఒక్కసారి త్రుళ్ళిపడిలేచింది

"అక్కయ్యా... నేనూ బావా సినిమా కెళ్తున్నాము"

"ఎవరు చెప్పారు?"

"బావే చెప్పాడు. బావ వెళ్తున్నాడు. నన్ను కూడ తీసుకెళ్తాడట."

"ఫోవే మొద్దూ., ఇవాళ సినిమాకి వెళ్ళకూడదే"

"ఏం ఎందుకని వెళ్ళకూడదు?"

"అంతే వే .. ఇవాళ బావగారు సినిమా కెళ్ళరే, అసలు వెళ్ళకూడదే..."

"ఎందుకని అక్కయ్యా "

"ఫో! మొద్దు ముండా! నీకేం తెలీదు" అని అరుంధతి విజయను కసరి కొట్టింది,

విజయ కిదంతా అయోమయంగా ఉంది. ఏమీ అర్థంగాలా. బిక్కమొహంతో అక్కగారి గదినుండి బయటికి వెళ్ళిపోయింది.

పాపం! ఇవేళ అక్కను బావను గదిలోకి పంపుతారని విజయ తెలుసుకోలేక పోయింది.